క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ తల్లి నిమజ్జనం



నిమజ్జనానికి సిద్ధంగా గంగమ్మ

తవణంపల్లె: దిగువమోదలపల్లెలో బుధవారం సాయంత్రం గంగమ్మ తల్లిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. దిగువమోదలపల్లెలో గంగమ్మతల్లికి గ్రామస్తులులు భక్తిప్రపత్తులతో అభిషేకం, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

పర్యావరణ దినోత్సవ ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం సత్యనారాయణపురంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది కలిసి స్థానిక వీధుల్లో ర్యాలీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని వైద్యులు పలువురు పేర్కొన్నారు. వైద్యులు కిరణ్, నిత్య, సాయిశృతి పాల్గొన్నారు.

పదవికి రాజీనామా

చిత్తూరు కార్పొరేషన్: మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి బుల్లెట్ సురేష్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను చీఫ్ సెక్రటరీకు పంపించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కొత్తపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. కల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కొత్తపేట వారపు సంతలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కల్లూరు పోలీసు సిబ్బంది, సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

దివ్యాంగులను భవిత కేంద్రంలో చేర్పించండి

పాకాల : ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సాధారణ పిల్లల మాదిరిగానే పాఠశాలల్లో చేర్పించవచ్చని జిల్లా సమగ్ర శిక్షా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఇరంగారిపల్లి, శ్రీనివాసపురం, ముద్దలపల్లి, ఉప్పువంక, దేశిరెడ్డిపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ గత నెల నుంచి దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో నమోదు చేసే సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ పిల్లలు సాధారణ పిల్లల్లాగే మెలగలేరని, వారిని భవిత కేంద్రంలోనే చేర్పించాలని సూచించారు. దివ్యాంగులకు అర్హత కలిగిన భవిత కేంద్రంలోని సహిత ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ప్రణాళిక సమన్వయకర్త రామచంద్రారెడ్డి, ఎంఈవో బాబ్జి, సహిత ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, సుందరి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అనారోగ్యం

- కార్మికుల జీవితాలతో సిబ్బంది ఆటలు
- ప్రోత్సాహకాలు ఇవ్వని వైనం
- పట్టించుకునే వారులేక అవస్థలు పడుతున్న కార్మికులు
- చిత్తూరు కార్పొరేషన్‌లో ఎవరికి వారే యమునా తీరే!





చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: ఊరు బాగుండాలంటే.. ముందుగా ఆ ఊరిని బాగుచేసే కార్మికులు బాగుండాలి. అదేమిటో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో మాత్రం అధికారులు బాగానే ఉన్నారు.. కానీ పట్టణాన్ని శుభ్రం చేసే కార్మికుల బాగోగులు మాత్రం పట్టించుకునే దిక్కు లేకుండా ఉంటోంది. కమిషనర్, ప్రజారోగ్యశాఖ అధికారి, ఇద్దరు గుమస్తాలు, ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నప్పటికీ ఈ విభాగంలో కార్మికుల ఇక్కట్లను పట్టించుకున్న పాపానపోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

ప్రోత్సాహకాలేవీ?

పొద్దుపొడవక ముందే నిద్రలేచి, చీపుళ్లను చేతబట్టి, రోడ్లు ఊడుస్తూ, వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, కాలువల్లో మురుగును తొలగిస్తూ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలకు ప్రతిఫలం లభించడం లేదు. వారికి సక్రమంగా వేతనాలు, ప్రోత్సాహకాలు ఇవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో దాదాపు 150 మంది వరకు శాశ్వత ప్రాతిపదికన, 200 మంది వరకు ఔట్‌సోర్సింగ్ కింద కార్మికులు పనిచేస్తున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగం (హెల్త్ సెక్షన్) నుంచే కార్మికులకు అన్ని ప్రోత్సాహకాలు అందాలి. కానీ ఏళ్ల తరబడిగా కార్మికులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంలో ఇక్కడ నిర్లక్ష్యం నెలకొంది. రెండేళ్లుగా కార్మికులకు యూనిఫామ్ ఇవ్వలేదు. ఏడాదిగా వీళ్లకు పాదరక్షలు, నూనె ఇవ్వడం మానేశారు. యూనిఫామ్ కుట్టుకోవడానికి ఇచ్చే ప్రోత్సాహకాలను రెండేళ్లుగా తొక్కిపెట్టారు. ఇక ఉద్యోగ విరమణ పొందడానికి సమీపంలో ఉన్న కార్మికులకు పీఎఫ్, పెన్షన్ ప్రతిపాదనలు, ఇతర అలవెన్సులను వారి సర్వీసు రిజిస్టర్ ఆధారంగా సిద్ధం చేయాల్సిన అధికారులు ఆ విషయాన్నే పట్టించుకోవడం మానేశారు.

అసలు గుమస్తా ఎక్కడ?

వందలాది మంది కార్మికులు పనిచేస్తున్న ప్రజారోగ్య విభాగంలో వాళ్ల సర్వీసు వివరాలు, ప్రోత్సాహకాలు చూసేందుకు ఎఫ్-1, ఎఫ్-2 పేరిట ఇద్దరు గుమస్తాలు ఉండాలి. కానీ ఇక్కడ ఆరునెలలకు పైగా ఎఫ్-1 గుమస్తా లేరు. మరో గుమస్తా ఉన్నా, లేనట్టేనని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న గుమస్తాకు ప్రజారోగ్య విభాగంలో అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు విభాగాలు చూడలేక ఆయన హైరానా పడుతున్నారు. తనకు సంబంధం లేకున్నా ఓ ఉద్యోగి వచ్చి ప్రతీనెలా కార్మికుల వేతనాల బిల్లులు సిద్ధం చేస్తున్నారు.. లేకుంటే వేతన బిల్లులు కూడా చేసే దిక్కులేదు. కార్మికుల ఇబ్బందులను పట్టించుకోవాల్సిన హెల్తాఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమకేమీ సంబంధం లేనట్టు వ్యవహరిస్తుండటంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మికులకు సకాలంలో ఇవ్వాల్సిన ప్రోత్సాహకాల ఫైళ్లను పక్కన పెట్టేసి, చేయని పనులకు బిల్లులు పెట్టడంలో బిజీగా ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమిషనర్‌తో మాట్లాడుతాం

హెల్త్ సెక్షన్ పెద్దది. ఇక్కడ కార్మికుల పనులు చేయడానికి ఓ గుమస్తా ప్రత్యేకంగా ఉండాల్సిందే. మరొకరికి ఇన్‌చార్జ్ వేస్తే పనులు చేయడం సాధ్యం కాదు. కార్మికులకు అందాల్సిన ప్రోత్సాహకాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎస్ఆర్ వివరాలపై కమిషనర్‌తో మాట్లాడుతాం. వెంటనే గుమస్తాను నియమించడానికి చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ప్రజారోగ్యశాఖ అధికారి, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

రథోత్సవం



కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన బుధవారం రథోత్సవం కనులపండువగా సాగింది. స్వామివారు రుక్మిణీ, సత్యభామ సమేతుడై దివ్య రథంపై కొలువుదీరి, గ్రామంలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి, వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తోమాల, అర్చన, కొలువు, సహస్రనామార్చన, శాత్తుమొర జరిపారు. 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారిని పట్టు పీతాంబరాలు, మరకత మాణిక్యాలు, వజ్రవైఢ్యూరాలతో శోభాయమానంగా అలంకరించి రథంపై అధిష్ఠింపజేశారు. అశేష భక్తజనుల గోవిందనామస్మరణల నడుమ స్వామి, అమ్మవార్ల రథోత్సవం గ్రామ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, రథంపై మిరియాలు, ఉప్పు చల్లుతూ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భజన బృందాలు, కోలాట ప్రదర్శనలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు ఆలయ ఆవరణలో ఊంజల్ మండపానికి చేరుకున్న స్వామివారికి ఊంజల్ సేవ చేశారు.

అశ్వవాహనంపై వేణుగోపాలుడి రాజసం

రాత్రి స్వామివారు అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ పార్థసారధి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయాధికారి సురేష్ కుమార్, షరాబ్ బాబు సురేష్, కంకణభట్టు నారాయణదాసరి, వేదపండితులు గోపాలాచారి, తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చక్రస్నానం గురువారం ఉదయం 9 గంటలకు రాజరాజేశ్వరీదేవి ఆలయ సమీపంలోని స్కందపుష్కరిణిలో నిర్వహించనున్నట్లు ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పల్లకి ఉత్సవం, 7.30 నుంచి 8.30 గంటల వరకు పుష్కరిణి వద్ద ఉభయ నాంచారి సమేత స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5.30 నుంచి 7 గంటల నడుమ ధ్వజావరోహణం కార్యక్రమం జరగనుంది. దీంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఎంఈవోలు

నగరి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖ అధికారులు శ్రీదేవి, నమశ్శివాయం తెలిపారు. వారు బుధవారం నగరి పట్టణంలో బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో గల స్వీట్ షాపులు, బట్టల షాపులు, పూల మార్కెట్లోని దుకాణాలను సందర్శించి పిల్లలను పనిలో పెట్టుకోరాదని యజమానులకు సూచించారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు, చిత్తూరు చైల్డ్ లేబర్ అధికారులు కె.హేమాచారి, జగదీష్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అధికారి ఎస్.అరుణ, డీసీపీయూ పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

అన్ని మండలాల్లోనూ టీడీపీకే ఆధిక్యం

- నాలుగో రౌండ్‌లో పుంజుకున్న వైఎస్సార్‌సీపీ
- ఆపై అన్ని బూత్‌లలోనూ వైఎస్సార్‌సీపీకి 20శాతం తక్కువైన ఓట్లు

పలమనేరు: నియోజకవర్గ కేంద్రమైన మున్సిపాలిటీతోపాటు అన్ని మండలాల్లోనూ ఓట్ల పరంగా టీడీపీ ఆధిక్యాన్ని కనబరచింది. మాజీమంత్రి అమరనాథ రెడ్డి సొంత మండలమైన పెద్దపంజాణిలో మెజారిటీ తగ్గినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ సొంత మండలమైన వీ.కోటలో టీడీపీ మెజారిటీ పెరగడం భారీనష్టాన్ని కలిగించింది. ఇక్కడ జెడ్పీ చైర్మన్ సొంత మండలమైనప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇక ఎన్నడూ వైఎస్సార్‌సీపీకి మెజారిటీ దక్కే బైరెడ్డిపల్లె, గంగవరం, పలమనేరులో సైతం ఓట్లు సైకిల్‌కు పడ్డాయి. ముఖ్యంగా మైనారిటీ ఓట్లు ఎక్కువగా ఉన్న పలమనేరు మున్సిపాలిటీలో సైతం టీడీపీకి ఎక్కువగా ఓట్లు రావడం వైఎస్సార్ సీపీ శ్రేణులకు నమ్మశక్యం కావడం లేదు.

రౌండ్ల వారీ ఆధిక్యం ఇలా....

నియోజకవర్గంలో మొత్తం 21 రౌండ్లు ఏర్పాటు చేశారు. ఇందులో బూత్ 1 నుంచి 49 దాకా పెద్దపంజాణి, 50 నుంచి వంద దాకా గంగవరం, 101 నుంచి148 వరకు బైరెడ్డిపల్లె, 149 నుంచి218 దాకా వీ.కోట, 219 నుంచి 287 వరకు పలమనేరు రూరల్, మున్సిపాలిటీలున్నాయి. ఇందులో తొలిరౌండ్‌లో టీడీపీకి 6420, వైఎస్సార్‌సీపీకి 4462 రాగా టీడీపీకి మెజారిటీ 1958తో మొదలైంది. రెండో రౌండ్‌లో టీడీపీ 5905, వైఎస్సార్‌సీపీ 4533 కావడంతో మళ్లీ టీడీపీకి 1372 మెజారిటీ దక్కింది. మూడో రౌండ్లో టీడీపీ 218 మెజారిటీ వచ్చింది. నాలుగో రౌండ్‌లో వైఎస్సార్‌సీపీ అనూహ్యంగా పుంజుకుని 979 మెజారిటీని సాధించింది. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. అయితే ఆ తర్వాత 21 రౌండ్లల్లోనూ టీడీపీనే ఆధిక్యత కనబరచడం, పోస్టల్ బ్యాలెట్లలోనూ టీడీపీదే పైచేయి కావడంతో టీడీపీ అభ్యర్థి అమరనాథ రెడ్డి పోస్టల్ బ్యాలెట్లతో కలిపి 20,122 మెజారిటీ సాధించారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు



దిగువమాఘంలో వైద్య పరీక్షలు



అరగొండలో వైద్యపరీక్షలు

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం దిగువ మాఘంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 47 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. అదేవిధంగా గర్భిణులకు, బాలింతలకు, బీపీ, సుగర్‌వ్యాధి గ్రస్తులకు, వృద్ధులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి. తవణంపల్లె పీహెచ్‌సీలో కాన్పులు చేయిస్తున్నట్లు వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్ పాల్గొన్నారు. అదేవిధంగా గర్భవతులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. అరగొండలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షం

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో బుధవారం కూడా విస్తారంగా వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కాలువలు, చెరువులకు నీళ్లు చేరాయి. చిన్నచిన్న కుంటలు నిండాయి. కురిసిన వర్షం ఖరీఫ్ రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

గర్భిణులకు పౌష్టికాహారం

పుత్తూరు: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో బుధవారం పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచివుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పౌష్టికాహార పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు యధావిధిగా విజిటబుల్ ఫలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, పంపిణీ చేశారు.

గాలీవాన ధాటికి ట్రాన్స్‌కోకు నష్టం



కొత్తపల్లెలో దెబ్బతిన్న కరెంటు స్తంభం




రెడ్డిగుంటలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

–కూలిన కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో మంగళవారం గాలీ వాన ధాటికి ఆశాఖకు నష్టం వాటిల్లింది. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మొత్తం కరెంటు స్తంభాలు 7, సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 3, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, 180 మీటర్లు కేబుల్స్ దెబ్బతిన్నాయని ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. దీంతోశాఖకు రూ.6 లక్షలు నష్టం వచ్చిందని చెప్పారు. సిబ్బంది పునరుద్ధరణ పనులకు పూనుకున్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే ఇంద్రవరదుడు

- నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



యాదమరిలోని ఇంద్రవరదుని ఆలయం, వార్షిక బ్రహ్మోత్సవాలలో ఊరేగనున్న ఉత్సవ మూర్తులు



యాదమరి (బంగారుపాళెం): గంగా, యమున, సరస్వతి– ఈ మూడు నదులు కలసి త్రివేణి సంగమంలో పడమర వైపు ముఖద్వారంతో యాదమరిలో ఇంద్రవరదుని ఆలయాన్ని ఇంద్రుడు నిర్మించినట్లు పురాణాల ప్రశస్తి. ప్రతి ఏటా ఈ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు 12 రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

భక్తురాలి కోసం ఆలయ ప్రతిష్ఠాపన

ఇంద్రుని భక్తురాలు పడమటి దేశం నుంచి తమిళనాడులోని కంచి వరదుని బ్రహ్మోత్సవాలలో ప్రతి ఏటా గరుడసేవకు వెళ్లి దర్శించుకునేది. నిండు గర్భిణిగా ఆమె ఉన్నప్పుడు కంచి వరదుని బ్రహ్మోత్సవాలలో గరుడసేవకు వస్తుండగా పురుటి నొప్పులు మొదలయ్యాయి. గాలీవాన హోరు నడుమ ఆమె పొదలచాటున పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే గరుడసేవను దర్శించుకోలేక పోయానని భక్తితో ఆమె ఇంద్రుడిని ప్రార్థించగా అక్కడే ఇంద్రుడు గరుడ వాహనంపై ప్రత్యక్షమయ్యాడని, ఆ స్థలంలో ఇంద్రుడే ఇంద్రవరదుని ఆలయం నిర్మించినట్లు పురాణగాథ.

యాదపోద నుంచి యాదమరిగా....

భక్తురాలి కోసం యాదపోద ఉన్నచోట ఆలయాన్ని నిర్మించడంతో ఇంద్రపురిగా పేరొచ్చింది. కాలక్రమంలో యాదపోద యాదమరిగా రూపాంతరం చెందింది. ఈ ఆలయానికి 2వ శతాబ్దంలో పల్లవరాజులు రాజగోపురం నిర్మించారు. 16వ శతాబ్దంలో శ్రీ కృష్ణదేవరాయుల ప్రహరీ గోడ, వాహనాల మండపం నిర్మించి, నిత్యపూజలు చేస్తూ, వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించే వారని చరిత్ర చెబుతోంది. అప్పటి నుంచి రోజూ నిత్యపూజలు, వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహించడం ఆనవాయితీ. అలాగేఈ ఆలయంలో వివాహం చేసుకుంటే మొదటగా మగబిడ్డ జన్మిస్తాడని అనాదిగా భక్తుల నమ్మకం.

నేడు అంకురార్పణ

వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ చేయనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ఆలయంలో మూలస్థానంలోని శ్రీదేవి, పెరుందేవి సమేత ఇంద్ర వరదరాజుల స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చన, పూజలు తదితర కైంకర్యాలు నిర్వహించిచేసి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విష్వక్సేన ఉత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ ఆగమ శాస్త్ర ప్రకారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలలో రోజువారీ కార్యక్రమాలివే..!

- జూన్ 6న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- 7న ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు చంద్ర ప్రభ వాహనసేవ.
- 8న ఉదయం సప్రంలో ఉత్సవం, రాత్రి 8 గంటలకు హంస వాహనసేవ.
- 9న ఉదయం సప్రంలో ఉత్సవం, రాత్రి 8 గంటలకు యాళీ వాహనసేవ
- 10న ఉదయం సూర్యప్రభ, రాత్రి 8 గంటలకు శేష వాహనసేవ
- 11న ఉదయం గరుడ వాహనం, రాత్రి కల్పవృక్ష వాహనసేవ
- 12న ఉదయం హనుమంతు వాహనం, రాత్రి కల్యాణోత్సవం, గజ వాహనసేవ
- 13న మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి తోట ఉత్సవం
- 14న ఉదయం అలంకార అభిషేకం, రాత్రి అశ్వ వాహనం
- 15న మధ్యాహ్నం తీర్థవారి, రాత్రి ధ్వజావరోహణం
- 16న ఉదయం అలంకార అభిషేకం, రాత్రి ద్వాదశి ఆరాధన
- 17న ఉదయం అలంకార అభిషేకం, రాత్రి వడాయితోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

పర్యావరణ పరిరక్షణకు కృషి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గంగవరం: విరివిగా మొక్కలు నాటి, పచ్చదనం పెంపుతో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని పలమనేరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శివన్న కోరారు. బుధవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఎఫ్ఆర్‌వోతో పాటు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వర్షాకాలంలో ఒక మొక్క నాటి సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములైనట్లేనన్నారు. ఆ మొక్కలే కాలక్రమంలో మహావృక్షాలు అవుతాయన్నారు. ఎవరైనా మొక్కలు నాటేందుకు ఆసక్తి కలిగి ఉంటే అటవీశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు కళాశాల ఉద్యానవనంలో మొక్కలు నాటారు. మన భూమి.. మన భవిష్యత్ నినాదాన్ని సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ చిదంబరం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుదామని నేషనల్ గ్రీన్– కోర్ మాస్టర్ వెంకటసిద్ధులు, డివిజినల్ కన్వీనర్ రాజేంద్ర కోరారు. బుధవారం పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని కల్లూరు హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ అనంతరం స్కూలు ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, ఉపాధ్యాయులు రాజశేఖర్, రేణుకాదేవి, చంద్రబాబు,నవాబ్ జాన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిన్నారులు

సదుం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని జోగివారిపల్లెలో చిన్నారులు బుధవారం మొక్కలు నాటారు. చెట్లతో మానవాళికి ఎంతో మేలు చేకూరుతుందని తమకు టీచర్లు చెప్పారని వారు తెలిపారు. మొక్కలు నాటిన వారిలో రమేష్, మహీధర్, హనీషా, హైందవి, స్నేహిత్, కీర్తి, ఆది, తేనేషా, స్నేహలత, వర్షిత, కేతిక, సాహిత్య, శాన్వి ఉన్నారు.

పచ్చదనం పెంపుతోనే ఆరోగ్యం

గుడుపల్లె: పచ్చని వాతవరణంతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ క్రిష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం పీఈఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణకు దోహదపడినట్లేనన్నారు. జీవ వైవిధ్యం కలిగి ఉండాలనే ఉద్దేశంతో క్యాంపస్ ఆవరణలో పలు విదేశీ మొక్కలు నాటినట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.